# అభిమానం ఖరీదు

ఎంత మండిపోతోంది. ఆకలితో లింగని కడుపూ, కోపంతో భుజంగరావు మనసూకూడా ఎండలాగే మండి పోతున్నాయి.

అంత ఎండలోనూ ఆకలిలోనూ ఎండిపోయిన మామిడి కొమ్మను కొడుతున్నాడు లింగడు. నిశ్శబ్దంగావున్న ఆ ప్రాంతంలో లయబద్ధంగా వినబడే "టక్" "టక్" మనే గొడ్డలి చప్పుడు, అలసటతో "హుం" "హుం" అని మూలిగే లింగని మూలుగులు వాయిద్యాల్లేని సంగీతంలా వినిపిస్తున్నాయి.

వచ్చి అయిదు నిమిషాలైనా మాటా పలుకూ లేకుండా నిలబడిపోయాడు భుజంగరావు. 'ఇంతకూ వీడు చేసిన తప్పుకు క్షమించి వదిలిపెట్టాలా లేక నాలుగు తన్నాలా ?" మనసులోనే మరోసారి ప్రశ్నించుకొని ఒక్క క్షణం ఆలోచించి ఏదో నిర్ణయానికొచ్చిన వాళ్లా "ఒరే లింగా !" అని పిలిచాడు కంఠంలో సాధ్యమైనంత కాఠిన్యాన్ని కనబరుస్తూ.

భుజంగరావు పిలుపుకు అదిరిపడ్డాడు లింగడు. గొడ్డలిగాటు వెయ్యబోయిన వాడల్లా భయంతో అలాగే బొమ్మలాగ నిలబడిపోయాడు. అలసటతో రొప్పుతూనే "దొ....రా....!" అన్నాడు భయం భయంగా.

"పిలుస్తుంటె రావేందిరా దొంగలం....కొడకా ?"

'నియ్యాలి ముండవొయ్య తను రాత్రి జేసిన పనిగాని తెలిసిందా ఏంది ?' మొదటిసారిగా తను చేసిన తప్పు భుజంగరావుకుగాని తెలిసిందేమోనని భయపడ్డాడు లింగడు. తనకు తానే దైర్యం చెప్పుకొని మనసును కూడగట్టుకొని చెట్టుపైనుండి కిందికి దిగాడు.

చింతచెట్టుకింద కొద్దిగా వున్న నీడలో నిలబడున్నాడు భుజంగరావు. అలవాటుగా బాగా తాగి వుండడంవల్లనూ కోపం వల్లనూ అతని కళ్ళు చింత నిప్పుల్లా ఎర్రబడున్నాయి. కోపంతో ముఖం జేవురించుకు పోయింది.

"ఊఁ....!" అన్నాడు భుజంగరావు. ఆ అనడంలో 'నీ తతంగమంతా తెలిసి.

## తెల్లపల్లి లక్ష్మయ్య

పోయిందిలే' అన్న భావం వ్యక్త మౌతోంది.

భుజంగరావు ముఖంలోకి చూడలేక పొయ్యాడు లింగడు. తప్పుచేసినవాన్లా తలదించుకొని "దొరా !" అన్నాడు.

"అరే లింగా ! నిన్న మీ సందోనికి డాక్టారుతో సూదిమందిప్పించినవంట గదరా ?"

"దాంచెన్ దొర !"

"మళ్ళ దబ్బేడి నుండొచ్చిందిరా ?"

"మా యింటి దాన్దగ్గర రొండ్రూపా ఖుంటె ఇచ్చి డాక్టరుబాబు కాళ్ళా యేళ్ళావడి సూదేపిచ్చినను దాంచెన్."

"నమ్మమంటావు" వ్యంగ్యంగా అడిగాడు భుజంగరావు. "అన్నట్టు మీ యింటిది డబ్బు కూడబెట్టేపాటిదయిం దన్నమాట ?"

"..............." మాట్లాడలేదు లింగడు. అవమానంతో అతని మనసు దహించుకుపోతోంది.

"గట్లగయితే రేత్తిరి యెంకటశెట్టి కమ్మిన సింతకాయల దబ్బేంజేసినవురా? సెట్లు లేకున్నా మీ ఇంట్ల సింతకాయలు కూడా కాస్తున్నాయా యేందిరా ?"

దెబ్బతిన్న లేడిలా భయంతో బెదురు చూపులు చూడసాగాడు లింగడు.

"యేంది దొరా నువ్వంటున్నది ? నేనేంది....సింతకాయలేంది ?" చంటి వానికి జ్వరం వస్తే డబ్బులు లేక చింత కాయలు దొంగిలించి వాటిని వెంకటశెట్టి కమ్మి వచ్చిన డబ్బుతో డాక్టరుగార్కి ఫీజానిచ్చి ఇంజక్షన్ ఇప్పించిన విషయం గుర్తుకు వచ్చినా ఏమీ తెలియనివాన్లా అమాయకంగా అడిగాడు.

నిప్పుతొక్కిన కోతిలా ఎగిరిపడ్డాడు భుజంగరావు. "దొంగతనం జేసింది జాలక ఇంకా ఏమీ దెల్వనట్టు మాట్లాడ వేందిరా లం .... కొడకా ?" అంటూ చేతిలో వున్న వూతకర్రతో "ఫెడీల్" మని లింగని భుజంపై ఒక్కటి కొట్టాడు. "అబ్బా !" అంటూ బాధతో వంకర్లు తిరిగి పొయ్యాడు లింగడు.

"ఈ అన్యాయాన్ని సహించలే నన్నట్టు"గా భుజంగరావు కర్ర "పట పట"మని రెండుగా విరిగిపోయి తన నిరసనను తెలియజేసింది. మరింత కోపంతో విరిగిన కర్ర ముక్కల్ని దూరంగా విసిరేశాడు భుజంగరావు.


"సత్తె పెమానకంగా నా...."

లింగని మాటలు పూర్తి కానేలేదు మరింత రెచ్చిపోయాడు భుజంగరావు. పిడికిలి బిగించి లింగని కడుపులో ఒక్క గుద్దు గుద్దబోయాడు.

భయంతో బాధతో ఆ దెబ్బను తప్పించుకోవాలని లింగడు కాస్త వెనక్కి తగ్గడంతో ఆ దెబ్బ కాస్తా అతని వృషణాలకు తగిలింది.

బాధతో విలవిల్లాడి పొయ్యాడు లింగడు. "అ....మ్మా...." అంటూ నేలకొరిగాడు. కళ్ళు బైర్లు కమ్మ సాగాయి. శరీరంనిండా ముచ్చెమటలు పోశాయి. నాలుక తడారిపోయింది. ఏదో మాట్లాడబొయ్యాడు. కాని నోటమాట పెగల్లేదు. అలాగే నోరు తెరచి నాలుక వెళ్ళబిడి కళ్ళు వెళ్ళబెట్టాడు.

ఖంగారు పడి పొయ్యాడు భుజంగ రావు. తాగిన మత్తు కాస్త వదిలి జరి గింది తెలుసుకున్నాడు. కాళ్ల వణకడం




మొదలు పెట్టాయి. భయం వల్ల శరీర మంతా చెమటలుపోశాయి. వణికే చేతుల్తో లింగని ముక్కు దగ్గర చెయ్యి పెట్టి చూశాడు.

"అ....అ్వా....యి పోయింది. ల్లి.... లి.... ల్లింగని శ్వాస ఆగిపోయివుంది. అంటే.... హం.... టే.... లింగడు.... లిం.... గ.... డు చచ్చి పోయాడు. క్త....క-కాదు....త్తనే....చ్చంపాడు. ఈ విషయం- ఎవరికైనా తెలిస్తే? అమ్మో! ఇంకా ఏమైనా వుందా? పోలీసులు.... సంకెళ్ళు.... జైలు.... తన కుటుంబం....తన ఆస్తి.... తన పరువు"

పిచ్చి పట్టిన వాళ్లా అటూ ఇటూ పరిగెత్తాడు భుజంగరావు. 'తన అదృష్టం బాగుంది. సమయానికెవరూ లేరిక్కడ' మనసులోనే అనుకొని కాస్త ధైర్యాన్ని కూడగట్టుకున్నాడు.

"ఎలాగైనా ఈ హత్యను ఆత్మ హత్యగా నమ్మించాలి. ఎలా....?"

బావి పక్కనున్న మోటారు పెట్టిన గది కనబడేసరికి చటుక్కున ఏదో గుర్తుకు వచ్చింది భుజంగరావుకు. పరుగున వెళ్ళి తలుపు తెరిచి అందులో నుండి ఓ ఎండ్రిన్ డబ్బాను తీసుకొచ్చాడు. గబ గబా డబ్బామూత పగుల గొట్టి తెరిచి వున్న లింగని నోట్లో కాస్త పోసి ముఖంపైనా చొక్కాపైనా కాస్త కాస్త చల్లి ఖాళీడబ్బాను చేతివేళ్ళ మధ్య వుంచాడు.

మరోసారి చుట్టూ కలియజూచి ఎవరూ లేరని నిశ్చయించుకొని చరచరా ఇంటి వైపు నడిచాడు.

* * *

"దొ....రా....!"

వీరన్న పిలుపుతో ఆలోచనలు కట్టి పెట్టి వాస్తవంలోకి జారుకున్నాడు భుజంగరావు. చుట్టపొగను గుండెనిండా పీల్చి వదులుతూ "ఏందిరా ఈరన్నా!" అన్నాడు.

"మన కుంటకింది బాయికాడి పొలంల లింగడు ఎండ్రిన్‌దాగి సచ్చిండు దొరా!"

"ఆఁ....!" ఒక్క వుదుటున లేచాడు భుజంగరావు. "లింగడు ఎండ్రిన్ దాగి సచ్చిండా?" ఆశ్చర్యాన్ని ప్రకటిస్తూ కండువా సర్దుకొని వీరన్న వెనకే బయల్దేరాడు.

భుజంగరావు వెళ్ళేసరికి లింగని శవం చుట్టూ జ న ం గు మి గూడి వున్నారు. భుజంగరావును చూ స్తూ నే "దొర" "దొర"అంటూ జనం పక్కకు తప్పుకొని దోవయిచ్చారు. లింగనిశవాన్ని చూస్తూనే "ఒరే లింగా"! అంటూ శవంపైన పడి పొయ్యాడు భుజంగరావు దుఃఖాన్ని నటిస్తూ.

భుజంగరావును చూసేసరికి ఓ ఆత్మీయుడ్ని చూసినట్టుగా అనిపించిందేమో లింగని పెళ్ళాం నాగమ్మలో కూడా దుఃఖం కట్టలు తెంచుకు ప్రవహించింది. "దొరా! నా మావఁ నా కన్నాయం జేసిండు దొరా!" అంటూ పెద్దగా రోదిస్తూ భుజంగరావు కాళ్ళపై పడింది.

కర్తవ్యం గుర్తుకొచ్చిన వాన్లా కళ్ళ నీళ్ళను తుడుచుకొని ముక్కు తుడుచుకొన్నాడు భుజంగరావు.

"దొరగారూ! అమీను సాబ్‌కు కబురెడ్తమంటారా?" అడిగాడు పోలీసు పటేలు లక్ష్మారెడ్డి.

"ఏంది లచ్చుమయ్యా! సూస్త సూస్త పీనుగనా పోలీసోళ్ళ పాల్జేతమంటావా? లింగడేం పరాయివాడా? నా సొంత తమ్మునసొంటోడు కాదూ?"

భుజంగరావు మాటలకు ఎదురుచెప్ప లేదు పోలీసు పటేలు.

జరపాల్సిన తతంగమంతా తనే దగ్గరుండి జరిపించాడు భుజంగరావు. తన సొంత మనిషి పోయిందానికన్నా ఎక్కువ బాధపడి బాధలో వున్న నాగమ్మను అన్నీ తనేయై ఓదార్చాడు.

భుజంగరావు చూపిస్తున్న అభిమానాన్ని చూసి "దొర దేవుడు" అనుకున్నది నాగమ్మ.

కాని భుజంగరావు చూపిస్తున్న అభిమానానికి ఖరీదుగా తనభర్త ప్రాణాన్నే బలిగొన్నాడని పాపం నాగమ్మ కేం తెలుసు?

(ఈ కథలోని 'లింగని' లాంటి ఓ అభాగ్యునికి బాధతో ఈ కథను అంకితం చేస్తున్నాను. — రచయిత)